క్లుప్తంగా

సీనియర్ బ్యూటీ థెరపిస్ట్‌లకు ఉచిత శిక్షణ

నిమ్మకూరు(పామర్రు): గ్రామంలోని నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం, మహిళా ప్రాంగణంలో ఏపీఎస్ఎస్‌డీఎస్ ద్వారా సీనియర్ బ్యూటీ థెరపిస్ట్‌లకు నాలుగు నెలలు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఆపైన చదివిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామని పేర్కొన్నారు. ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 08674 294257లో సంప్రదించాలని సూచించారు.

గోశాలకు పశుదాణా

గుడివాడటౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కౌ హగ్ డే (గోమాతను ఆలింగనం) నిర్వహించారు. స్థానిక ప్రణవాశ్రమంలోని గోశాలకు క్లబ్ ఆధ్వర్యాన దాణా అందజేసి సభ్యులు ఆవును ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామధేనుగా పిలిచే గోమాతను పూజించడం, ప్రేమించడం, వాటి ఆరోగ్యాలను పరిరక్షించడం మన సంప్రదాయమన్నారు. దీనిలో భాగంగా క్లబ్ ఆధ్వర్యంలో దాణా అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అర్జా ప్రసాదు, వంగపండు బ్రహ్మాజీ, ఆర్‌కే రామకృష్ణ, ఆర్.వేణు, ఎం. రామకృష్ణ, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



గుడివాడటౌన్: జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే సహించబోమని రూరల్ మండల ఎంపీడీఓ ఏవీ రమణ అన్నారు. రూరల్ మండలం శేరీవేల్పూరులో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను ఆమె మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి కావల్సిన ఇనుము, సిమెంట్‌ను సబ్సిడీతో తక్కువ ధరకు ఇస్తుందని ఇసుక ఉచితంగా అందజేస్తుండటంతో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వేసవిలోపు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ డి.పృథ్వీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలంలో జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలని మండల ప్రత్యేక అధికారి వెంకట్రావు కోరారు. నందివాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, ఈఓపీఆర్డీ జి శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ రాధాకృష్ణలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లిక, ఏపీఎం ప్రధానరావు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గుడివాడటౌన్: గుడివాడ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అతని ఫోన్‌ను అప్పగించిన ఘటన సోమవారం రాత్రి పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి హైదరాబాద్ వెళ్తున్న ప్రయాణికుడి ఫోన్ బస్టాండ్‌లో చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు 5 గంటల్లో సమాచారం తెలుసుకుని ఫోన్‌ను తిరిగి బాధితుడికి అప్పగించినట్లు సీఐ తులసీధర్ తెలిపారు. రూ.లక్ష విలువచేసే యాపిల్ ఫోన్‌ను బాధితుడికి అందజేసినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఏఎస్సై ప్రకాశరావు, హెడ్ కానిస్టేబుల్ శివాజీ పాల్గొన్నట్లు ఎస్సై వివరించారు.

'ఆత్మ' క్షేత్రస్థాయి పరిశీలన



యద్దనపూడి(మొవ్వ): పంటను అమ్ముకోవడానికి, పంట బీమాకు, వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాల లబ్ధి పొందడానికి ఈ-పంట నమోదు తప్పని సరి అని అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) సంచాలకులు ప్రమీల సూచించారు. మొవ్వ మండలం యద్దనపూడిలో 2022-23 రబీలో ఈ క్రాప్ చేసిన పొలాలను ఆత్మ డైరెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, ఎంఏఓ కె.శివప్రసాద్, వీఆర్వో కోటేశ్వరరావు, వీఏఏ నాగ శ్రావణ, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబ శ్రేయస్సు

అవనిగడ్డ: ఆర్థిక అక్షరాస్యతపై కుటుంబం శ్రేయస్సు ఆధార పడి ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఉమారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సేవల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ అమిద్‌కృష్ణ, అధ్యాపకులు వీర కుమారి, కె. అంకారావు, ఐక్యూఏజీ సమన్వయకర్త బి. సంధ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో అంగన్‌వాడీలకు మహర్దశ

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పామర్రులో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న నాడు-నేడు పథకంతో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ ఏర్పడిందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌అన్నారు. కొత్తపేటలోని బాలిక పాఠశాల ప్రాంగణాల్లో మంగళవారం అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణాలకు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపొందుతున్నాయన్నారు. ప్రభుత్వం పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన, ఉచిత భోజన సదుపాయం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలతో పాటుగా ఉపకార వేతనాలను కూడా అందిస్తున్నారన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. దీనిలో భాగంగా పామర్రులో తోటలోని అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి రూ.16 లక్షల వ్యయ అంచనాతో పనులు ప్రారంభించామన్నారు. యలమర్రు రోడ్డులోని బాలికల పాఠశాల ప్రాంగణంలో కూడా రూ.16లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి పనులు ప్రారంభించామని అన్నారు. పనులు వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, రమాదేవి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, వార్డు మెంబరు నందిపాటి సురేష్‌రెడ్డి, నాయకులు అప్పిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో భానుశ్రీ, సూపర్‌వైజర్ పుణ్యవతి, కమిటీ చైర్మన్ కుంభా సుందరమ్మ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



పామర్రులో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ కస్తూరి



సైకిల్ ర్యాలీలో వైద్యులు, విద్యార్థులు

గుడివాడటౌన్: యువత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవి అన్నారు. మంగళవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యాన పట్టణంలో వైద్యులు, విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాదేవి మాట్లాడుతూ ఆహార అలవాట్లు, ఒత్తిళ్ల కారణంగా క్యాన్సర్ వచ్చే అవకాశముందన్నారు. ప్రతి ఒక్కరూ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రతినెలా 14వ తేదీన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ అనూరాధ, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు అవగాహన ర్యాలీ

పామర్రు: ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా క్యాన్సర్, బీపీ, షుగర్ నివారణకు అవగాహన సైకిల్ ర్యాలీ నిర్వహించామని సర్పంచ్ కేతావత్ కస్తూరి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి మంగళవారం ర్యాలీని ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ క్యాన్సర్‌కు సరైన సమయంలో మందులు వాడితే త్వరితగతిన తగ్గించవచ్చన్నారు. బీపీ, షుగరు తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండటానికి సైకిల్ ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల రైతు సలహా మండలి అధ్యక్షులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు సుధారాణి, హెల్త్ సూపర్‌వైజర్ శంకరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: సైక్లింగ్‌తో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మెగా సైక్లాథాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది పాఠశాలల విద్యార్థులతో కలిసి సైక్లింగ్ నిర్వహించటంతోపాటు క్యాన్సర్‌పై అవగాహన కలిగించారు. ఐలూరులో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటశివయ్య, ఎంపీడీఓ స్వర్ణలత, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ శ్రీలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ: మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలల్లో నాన్ కమ్యూనల్ డిసీజెస్, సైక్లింగ్‌తో కలిగే ప్రయోజనాలపై అవగాహనా ర్యాలీ చేశారు. మండల వైద్యాధికారి వేదరాజ్ ఆధ్వర్యంలో కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు(పమిడిముక్కల): వీరంకిలాకు పీహెచ్‌సీ పరిధిలోని పమిడిముక్కల సచివాలయం, మేడూరు, ఐనపూరు, చోరగుడి సచివాలయాల్లో హెల్త్ మెగా సైక్లోథన్ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పద్మజ, ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యలమర్రు(పెదపారుపూడి): యలమర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సార్వత్రిక ఆరోగ్య దినోత్సవ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వధువుకు కల్యాణమస్తు అందజేత



పామర్రు: జోకిపర్రులోని పాల సేకరణ కేంద్రంలో పాలు పోసే సభ్యులైన అయూబ్‌ఖాన్ కుమార్తె వివాహం పామర్రు గ్రామంలోని పాల శీతల కేంద్ర కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. వేడుకలలో పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ పాల్గొని మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రవేశ పెట్టిన కళ్యాణ మస్తు పథకంలో భాగంగా అయూబ్‌ఖాన్ కుమార్తె పెళ్లి సందర్భంగా నూతన వధువుకి సుమారు 25 వేల విలువైన 4 గ్రాముల గోల్డు కాయిన్‌ను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రస్టు బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, జోకిపర్రు సంఘ అధ్యక్షులు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహ ఏర్పాటుకు సిద్ధం



ఎమ్మెల్యే నానితో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

గుడివాడటౌన్ : బీసీల ఆరాధ్య దైవం జ్యోతిరావు పూలే, సావిత్రీభాయ్‌పూలేల విగ్రహాల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. భూమి పూజలకు రావలసిందిగా ఏపీ బీసీ సంఘం నాయకులు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)ని కోరారు. రాజేంద్రనగర్ లోని ఆయన నివాసంలో మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ అనుకూలమైన రోజు చూసి నిర్ణయిస్తే భూమిపూజకు వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆది విష్ణు, గుడివాడ శాఖ అధ్యక్షుడు దారం నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత నర్రా మృతి



ముదినేపల్లి రూరల్ : వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, పార్టీ మండల రైతు విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి నర్రా వెంకటేశ్వరరావు(80) సోమవారం రాత్రి మృతి చెందారు. చినపాలపర్రుకు చెందిన ఆయన అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న నియోజకవర్గ నేత దూలం ఆది వినయ్‌కుమార్, ఎంపీపీ సత్యనారాయణ, జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ మంగళవారం వెంకటేశ్వరరావు స్వగ్రామానికి చేరుకుని భౌతికకాయన్ని సందర్శించి పూలమాలలు వేసి పార్టీ కండువా కప్పి నివాళులు అర్పించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సంధ్య, వైస్ ఎంపీపీ రాధా, పార్టీ నేతలు భిక్షాలు, రామకృష్ణ, అల్లాభక్షు, శేషు తదితరులు నివాళులర్పించారు.

పంచాయతీ కార్యాలయం తాళం తీసుకెళ్లిన సర్పంచ్

- కార్యాలయం బయటే సిబ్బంది ఉదయం 11.30 గంటల తర్వాత తాళం పగలగొట్టి లోపలకు..



పంచాయతీ కార్యాలయానికి ఉన్న తాళాన్ని పగలకొట్టిస్తున్న గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం

జమీగొల్వేపల్లి(పామర్రు): జమీగొల్వేపల్లి సర్పంచ్.. పంచాయతీ తాళాలు తీసుకెళ్లిపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఉదయం 9.30 గంటలకు వచ్చినా 11.30 తర్వాత కార్యాలయం తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే గ్రామంలోని పంచాయతీ భవనంలోనే సచివాలయ, పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారు. రోజూ ఉదయం 9.30 గంటలకు సిబ్బంది వచ్చే సమయానికి తాళాలు తీయడం సాయంత్రం వేసి తీసుకెళ్లే పనులు అక్కడి గుమాస్తా చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సిబ్బంది కార్యాలయానికి చేరుకునే సమయానికి పంచాయతీ తాళాలు ఇంకా వేసి ఉండటంతో గుమాస్తాని పిలిచి తాళం తీయలేదేంటని అడిగారు. దీనితో గుమాస్తా తాళాలును సర్పంచ్ శాంతకుమారి తీసుకువెళ్లారని చెప్పారు. ఈ విషయాన్ని సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లారు. కార్యదర్శి తాళం ఇవ్వాలని సర్పంచ్ వద్దకు సిబ్బందిని పంపినా ఇవ్వలేదు. ఈ విషయాన్ని కార్యదర్శి మండల పరిషత్ అధికారి రామకృష్ణకు వివరించగా తాళం పగలగొట్టి కార్యాలయంలోకి వెళ్లాలని ఆదేశించారు. దీంతో తాళం పగలగొట్టారు.

గృహ నిర్మాణాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు

గుడివాడటౌన్ : నవరత్నాలు అమల్లో భాగంగా ప్రతి పేదవానికి సొంత ఇల్లు నిర్మించాలని ప్రభుత్వ లక్ష్యం నెరవేరడానికి ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తున్నామని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శివరామ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకట రమణ హౌసింగ్ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలు, డ్వాక్రా పొదుపు సంఘాల నుంచి రూ 35 వేలు, బ్యాంకు లింకేజి రుణం రూ 35 వేలు నుంచి రూ 50 వేలు, గృహలక్ష్మి పథకం ద్వారా రూ 35 వేలు నుంచి లక్ష, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.50 వేలు వడ్డీలేని రుణం, 60 ఏళ్లు దాటిన మహిళలను సైతం డ్వాక్రా గ్రూపుల్లో చేర్చి వారికి రూ 35 వేలు రుణం పొందే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ సమాచారాన్ని లబ్ధిదారులకు తెలియచేసి ఇళ్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ కో ఆర్డినేటర్ డి.త్రిపుర సుందరరావు, ఏపీఎం డి.సాంబశివరావు, హౌసింగ్ ఏఈ డి పృథ్వీ, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



డ్రెయినేజీ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కంభపు రాంబాబు

పామర్రు(పమిడిముక్కల): పాఠశాలల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు అన్నారు. పమిడిముక్కల మండలం మంటాడ సచివాలయం రెడ్డిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద జరుగుతున్న డ్రెయినేజీ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం అమలును ఇటీవల జెడ్పీటీసీ యేసుగ వెంకట రమణకుమారి పాఠశాలను పరిశీలించారని పేర్కొన్నారు. పాఠశాల డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని గుర్తించారన్నారు. డ్రైనేజీ వ్యవస్థలను సొంత నిధులతో బాగు చేయిస్తానని ఇచ్చిన హామీపై పనులను ప్రారంభించారని చెప్పారు. సుమారు 100 మీటర్ల పొడవు అడుగున్నర లోతు, అడుగు వెడల్పుతో కాల్వ అభివృద్ధి జరుగుతోందన్నారు. పాఠశాలలోని సెప్టిక్ ట్యాంక్‌కు కొత్తవరలు, కొత్తప్లేటు వేసి రిపేరు చేయించారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ దారపు రమాదేవి, నాయకులు యేసుగ మస్తాన్‌రావు, చల్లా లక్ష్మణ్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల ఉపకరణాలకు పరీక్షలు

గుడివాడటౌన్: దివ్యాంగుల సంక్షేమానికి సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీకి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష గుడివాడ యూనిట్ నిర్వాహకులు నీలాంబ్రమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి దివ్యాంగుల ఉపకరణ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వారి అవసరాల మేరకు వీల్ చైర్స్, ట్రైసైకిల్స్, వినికిడి యంత్రాలు, రోలేటర్స్, క్యాలిబర్స్, బ్రెయిలీకిట్స్ అందజేస్తారని తెలిపారు. గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ, పెదపారుపూడి, ఉంగుటూరు, బాపులపాడు, గన్నవరం మండలాల వారికి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

బోధనా సామర్థ్యంపరిశీలన

మండవల్లి : మండలంలోని మొఖాసాకలవపూడి ఎంపీపీ స్కూల్లో టీచ్ ప్రైమరీ అనే క్లాస్‌రూమ్ అబ్జర్వేషన్ టూల్ ఉపయోగించి మంగళవారం ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను సీఆర్పీ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. టీచ్ ఏపీ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు టి.పిచ్చోడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వం ఎంతోమందికి ఆదర్శం



విశ్వనాద్రిపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్



మహిళకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం అలీనకీ పాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం అందించిన నవరత్న పథకాలపై వారికి వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగుతోందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు మీర్జా దియానత్ అలి, ఎంపీటీసీ మీర్జా సజ్జిద్ అలి, మండల కన్వీనర్ యలమంచిలి గణేష్, కార్యదర్శి మారపాక మహేష్, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పేదలకు వరాలు వంటివని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నవరత్నాల పథకాలను సమర్థంగా పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఆలోచిస్తున్నట్లు చెప్పారు.

గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని ఆక్వా రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు.

మీ ఆశీస్సులే నంబర్‌వన్

నియోజకవర్గంలోని ప్రజల ఆశీస్సులతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రంలోనే నియోజకవర్గం నంబర్ వన్ స్థాయిని సాధించినట్లు ఎమ్మెల్యే డీఎన్నార్ చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాడంకి శిరీష ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, సర్పంచ్ తాడంకి శిరీష, ఎంపీటీసీ తుమ్మచర్ల ఏసుబాబు, సొసైటీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణచంద్రరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, నేతలు పాల్గొన్నారు.

జయమంగళకు కొల్లేరు ప్రజల అండ

- బహిరంగ సభకు భారీగా వచ్చిన ప్రజలు
- వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు జయమంగళ ప్రకటనపై హర్షం
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కొల్లేరు ప్రాంతాల అభివృద్ధి



జయమంగళ సభకు భారీగా వచ్చిన కొల్లేరు నాయకులు, అభిమానులు

కైకలూరు: నమ్మించి మోసం చేసిన టీడీపీని వీడుతున్నట్లు ప్రకటించిన మాజీఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి జయమంగళ వెంకటరమణకు పూర్తి మద్దతు అందిస్తామని కొల్లేరు ప్రజలు ప్రతినబూనారు. వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నట్లు ప్రకటించడానికి జయమంగళ ఆటపాక పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం కొల్లేరు ప్రజలు, పెద్దలు, అభిమానులతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లా పరిధిలోని తొమ్మిది మండలాల నుంచి కొల్లేరు పెద్దలు తరలివచ్చారు. జయమంగళ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు ప్రజల సంక్షేమానికి వడ్డీ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి మహిళకు అవకాశం కల్పించారన్నారు. కొల్లేరు కాంటూరు కుదింపు, రెగ్యులేటర్ల నిర్మాణం, రీసర్వే, ఆక్వాజోన్ పరిధిలోకి మరిన్ని చెరువుల చేరిక వంటి పనులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. చంద్రబాబుతనను గొర్రెను బలిచ్చినట్లుగా 2019 సీటు ఇచ్చి ఓటమికి కారణమయ్యారన్నారు. కొల్లేరు ప్రజల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉంటుందనే పార్టీలోకి చేరుతున్నానని తెలిపారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ముంగర నరసింహారావు, టీడీపీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు, నియోజకవర్గం నుంచి పలువురు అభిమానులు, బీసీ నేతలు హాజరయ్యారు.

మార్మోగిన జగన్ నినాదం

నిత్యం పచ్చజెండాలతో రెపరెపలాడే ఆటపాక టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు మార్మోగాయి. యువత జై జగన్ అంటూ సందడి చేశారు. సమీపంలోని టీడీపీ ఫ్లెక్సీలను కొందరు తొలగించే పనిలో ఉన్నారు. కొల్లేరు ప్రజలు ఇంత పెద్ద ఎత్తున సభకు రావడం ఇటీవల కాలంలో ఇదే కావడం అని పలువురు అన్నారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: మహాశివరాత్రి ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలియజేశారు. ఐలూరులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 18న జరగనున్న శివరాత్రి ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. అనిల్‌కుమార్ తొలుత రామేశ్వరస్వామికి, రఘునాయకస్వామికి ప్రత్యేకపూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, దేవాదాయశాఖ అధికారులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి భక్తుల సౌకర్యాల కోసం తీసుకుంటున్న ఏర్పాట్లపై చర్చించారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన ఐలూరులో శివరాత్రి పెద్ద పండుగలా జరుపుకుందామన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హరిగోపీనాథ్ బాబు, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సీఐ కిషోర్‌బాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, సర్పంచ్ పిరాటి సుజాత, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నడకుదురు రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకనుగుణంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు గృహ సారథులు సారథ్యం వహించాలని, పేదల అభివృద్ధే లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వలంటీర్లకు అవగాహన సదస్సు సింగరాయపాలెంలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేర్చి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని, అంకిత భావంతో పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.